# మంచం పట్టిన గొడవర్రు

- జీసీ కాలనీలో విజృంభించిన జ్వరాలు
- కీళ్లవాతం, వాపులు, దద్దులతో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ



గొడవర్రులో జ్వరాలు, నొప్పులతో అవస్థ పడుతున్న బాధితులు



వాపు వచ్చిన కాళ్లను చూపుతున్న కాగిత సత్యనారాయణ

**కంకిపాడు:** గొడవర్రు గ్రామం మంచం పట్టింది. జ్వరాలు, కాళ్ల వాపులు, కీళ్ల వాతంతో వారాల తరబడి జనం అవస్థలు పడుతున్నారు. రోగాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మొక్కుబడి గృహ సందర్శనలు చేసి పారాసెటమాల్ మందు బిళ్లలు ఇచ్చారే కానీ, మెరుగైన వైద్యం అందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**నడిచేందుకు సైతం ఇబ్బందులు**

గొడవర్రులోని బీసీ కాలనీలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. సుమారు నెల రోజులుగా ఇక్కడి ప్రజలు జ్వరాలు, కీళ్ల వాతం, కాళ్ల వాపులతో మంచాన పట్టారు. సుమారు 35 గృహాల్లో జ్వర పీడితులు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఒళ్లంతా దద్దుర్లు, దురదలు, మొఖం నల్లమచ్చలు బారుతుంది. నడిచేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఒకరికి జ్వరం వస్తే ఇల్లంతా వ్యాపించి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నామంటూ వాపోతున్నారు. చిన్నారులు నుంచి వయోవృద్ధులు వరకూ బాధితులు ఉన్నారు. కేవలం జ్వరం, నొప్పులే కాకుండా శ్వాస ఆడక పలువురు ప్రైవేటు ఆసుపత్రుల్లో లక్షలు పోసి వైద్యం పొందారంటే తీవ్రత ఏ మేరకు ఉందో అర్థమవుతుంది.

**మొక్కుబడిగా వైద్య సేవలు**

ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గృహ సందర్శనలు చేసిన స్థానిక సిబ్బంది పారాసెటమాల్ మందు బిళ్లలు ఇచ్చారని, కనీసం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో కూడా తెలుసుకునే పరిస్థితి ఆ శాఖ చేయలేదంటూ విమర్శిస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లామని, కష్టం చేసుకున్న సొమ్ములు మందులు, వైద్య ఖర్చులకే అయిపోయాయని, ఆర్థిక ఇబ్బందులు కూడా పడాల్సి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పట్టించుకున్న వాళ్లే లేరు



ఇల్లంతా జ్వరాలే. రోజుల తరబడి ఇబ్బంది పడుతున్నాం. కాళ్ల నొప్పులు, వాపులతో బయటకు వెళ్లలేకపోతున్నాం. ఇన్ని ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నా కనీసం మమ్మల్ని పట్టించుకున్న వాళ్లే లేరు. ఆరోగ్య సిబ్బంది మొక్కుబడిగా వచ్చి వెళ్లిపోయారు.

– చెన్ను కుటుంబరావు, గ్రామస్తుడు

### నడవాలంటే నరకం



నెల రోజులుగా జ్వరం, కాళ్ల వాపులతో ఇబ్బంది పడుతున్నాం. ముఖం నలుపు రంగు వేసింది. దద్దుర్లు కూడా వచ్చాయి. ఎందుకు, ఏమిటి అంటే చెప్పిన వాళ్లే లేరు. నడవాలన్నా నరకం చూస్తున్నాం. ఆరోగ్య సిబ్బంది స్పందించి వైద్య శిబిరాలు నిర్వహిస్తే ఆరోగ్య సమస్యలు తీరతాయి.

– కాగిత రాజేశ్వరి, గ్రామస్తురాలు

### ప్రైవేటు ఆసుపత్రులే దిక్కు



ఆరోగ్య సిబ్బంది వచ్చి చూసెళ్లి పోయారు. వాళ్లు ఇచ్చిన మందులకు తగ్గలేదు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నా. జ్వరం, నొప్పులు తగ్గడానికి రూ. 10 వేలు అయ్యాయి. కష్టం చేసి జాగ్రత్త చేసిన డబ్బులు అయిపోయాయి. నొప్పులు మాత్రం ఇంకా తగ్గలేదు. చాలా కష్టంగా ఉంది.

– ఉండవల్లి విజయలక్ష్మి, గ్రామస్తురాలు

## భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



పోరంకి శ్రీవేణుగోపాలస్వామి



దావాజీగూడెం రామాలయంలో ఉత్తర ద్వార దర్శనం ఇస్తున్న స్వామివారు



కంకిపాడులోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

**పెనమలూరు:** పోరంకి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సత్యభామ సమేత వసంత వేణుగోపాల స్వామివారి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. వేకువజామునే భక్తులు ఆలయానికి చేరుకున్నారు. కాగా శనివారం కూడారై ఉత్సవం, శ్రీగోదారంగనాయకులకు 108 గంగాళాలతో నివేదన ఉంటుంది. అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామాల ఆలయాల్లో ముక్కోటి ఏకాదశిని భక్తులు ఘనంగా చేశారు.

**గన్నవరం:** మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తొలుత నగర సంకీర్తన, సామూహిక కుంకుమార్చనలు, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పరిమళభరిత పుష్పమాలలతో స్వామివారిని అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎస్. రామాచార్యులు, ధనుర్మాస గోష్ఠి సభ్యులు పాల్గొన్నారు. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు.

**కంకిపాడు:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. కంకిపాడు, ఈడుపుగల్లు, ఉప్పలూరు, ప్రొద్దుటూరు, తదితర గ్రామాల్లో విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు. కంకిపాడు పట్టణంలో చెన్నకేశవస్వామి, రామలింగేశ్వర స్వామివార్ల దేవతామూర్తులను ఘనంగా ఊరేగించారు.

**ఉయ్యూరు:** వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేకువజాము నుంచే వైష్ణాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో వివిధ రూపాల్లో కొలువుదీరిన స్వామివారిని భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని భక్తిపారవశ్యం చెందారు.

**వైష్ణవాలయాల్లో భక్తుల రద్దీ**

**విజయవాడరూరల్:** మండలంలోని పలు గ్రామాల్లో ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం వైష్ణవాలయాల్లో భక్తులు ఉత్తర ద్వారంలో స్వామివారిని దర్శించుకున్నారు. నున్న గ్రామంలోని చంద్రశేఖరేంద్ర సరస్వతీస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చనలు, అలంకారం చేశారు. ప్రసన్న వెంకటేశ్వరస్వామికి లక్ష తులసీ పూజ చేశారు. రూరల్ మండలంలోని పలు గ్రామాల వైష్ణవాలయాల్లో స్వామివారిని భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

## ఉత్సాహంగా విబ్రాంజ-2025



విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

**రామవరప్పాడు:** విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఫౌండేషన్ వారి విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం విబ్రాంజ-2025 కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రు ఎడ్యుకేషన్ సీఈఓ డాక్టర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ హాజరయ్యారు. ఉభయ కృష్ణాజిల్లాతో పాటు గుంటూరు జిల్లాలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు క్రీడా, సాంస్కృతిక నైపుణ్యాలను ప్రదర్శించారు. అనంతరం క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు. ఎస్డీఎంఎస్ మహిళా కళాశాల ఫార్మర్ డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి, కళాశాల చైర్మన్ బీఎస్ అప్పారావు, సెక్రటరీ శ్రీ కృష్ణ, ప్రిన్సిపాల్ పద్మలత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయిన మహిళ

**పెనమలూరు:** యనమలకుదురులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ తన కాలు కోల్పోయిన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. యనమలకుదురు మాదుతిరుపతిరావునగర్‌కు చెందిన కె.ప్రేమలత ఇద్దరు పిల్లలు శివాలయం వద్ద కరాటే నేర్చుకుంటున్నారు. వారిని తీసుకురావడానికి ప్రేమలత వెళ్లింది. అయితే తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా లారీ వచ్చి ఆమెను ఢీ కొట్టింది. గాయపడిన ఆమెను విజయవాడ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా వైద్యులు కాలుకు ఆపరేషన్ చేసి తొలగించారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## జాతీయస్థాయి జూనియర్ లంగడి పోటీలు



లంగడి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

**విజయవాడరూరల్:** లంగడి ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడరూరల్ మండలం నున్న జెడ్పీ హైస్కూల్‌లో 14వ జాతీయ జూనియర్ లంగడి చాంపియన్‌షిప్ 2024–25 పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 14వ తేదీ వరకు జరగనున్న పోటీల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 360 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో లంగడీ అసోసియేషన్ సెక్రటరీ అరవ రమేష్, హైస్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ గద్దం కుమార్, లంగడి ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్ ఎ.గాంధీ, ఏపీ లంగడి అసోసియేషన్ ప్రెసిడెంటు ఎం.లక్ష్మీవెంకటేశ్వరరావు, టోర్న మెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బి.శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్లివిరిసిన ముందస్తు సంక్రాంతి శోభ



కోడి పుంజులను చూపుతున్న దంత వైద్య విద్యార్థినులు



ఉయ్యూరులో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు

**గన్నవరం రూరల్:** మండలంలోని చినఆవుటపల్లి డాక్టర్స్ సుధా నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో శుక్రవారం సంక్రాంతి శోభ వెల్లివెరిసింది. దంత వైద్య విద్యార్థులు, హెచ్‌వోడీలు పల్లెటూరి సాంప్రదాయ వస్త్రధారణలతో మెరిశారు. విద్యార్థినుల విన్యాసాలు అలరించాయి. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కన్వీనర్ పాలడుగు నాగసాయి మధుసూధనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, ఏఓ వై.మధుసూధనరావు పాల్గొన్నారు.

**ఉయ్యూరు:** సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. శ్రీ శ్రీనివాసా విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు శుక్రవారం నిర్వహించారు. బొమ్మలకొలువు, రంగవల్లులు, పాల పొంగళ్లు, గంగిరెద్దుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ప్రాంగణంలో సందడి నెలకొంది. పోటీల్లో విజేతలకు విద్యాసంస్థల అధినేత డాక్టర్ పరుచూరి శ్రీనివాసరావు, డైరెక్టర్ నీలిమ బహుమతులు అందించారు. అలాగే ఉయ్యూరు పట్టణంలోని నారాయణ పాఠశాలలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు.

**పీవీపీ సిద్ధార్థలో సంక్రాంతి సందడి**

**పెనమలూరు:** కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం సంక్రాంతి సందడి నెలకొంది. విద్యార్థినులు కోలాటం, గొబ్బెమ్మల నృత్యాలతో సందడి చేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శారద విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి, సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, కన్వీనర్ వెల్లంకి నాగభూషణం, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, డాక్టర్ ఎం.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



పీవీపీ సిద్ధార్థలో విద్యార్థినుల కోలాటం

### చిన్నారులకు భోగిపండ్లు



వణుకూరులో చిన్నారులకు భోగిపండ్లు పోస్తున్న సీడీపీవో బేబీసుకన్య

**పెనమలూరు:** మండల పరిధిలో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో సంక్రాంతి సందర్భంగా పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీవో కె.బేబీసుకన్య పెనమలూరు, గంగూరు, వణుకూరు, గోసాల ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు చదువు, ఆటపాటలతో పాటు సంస్కృతిని నేర్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న వాకర్స్

**గన్నవరం:** స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు జరిగాయి. తొలుత ఈ పోటీలను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, న్యాయవాది తిరివీధి వెంకయ్య ప్రారంభించారు. అనంతరం జరిగిన పోటీల్లో సుమారు 50 మంది మహిళలు పాల్గొన్ని పోటాపోటీగా రంగవల్లికలను తీర్చిదిద్దారు. విజేతలకు వాకర్స్ సభ్యులైన జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, సర్పంచి నిడమర్తి సౌజన్య, వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్, చిమట రామారావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి సగ్గుర్తి శ్రీనివాసరావు, కోశాధికారి బొక్కినాల కోటేశ్వరరావు, వాకర్స్ నారాయణ, పీడీ చందు తదితరులు పాల్గొన్నారు.

## గోకులాలతో పశుపోషకులకు ఊతం

**కంకిపాడు:** గోకులాలతో పశుపోషకులకు ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు పట్టణంలో రూ. 2.30 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డును ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పశుపోషకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, ఎంపీడీఓ పి.అనూష, పశువైద్యాధికారి జి.రవి పాల్గొన్నారు.

**నేడు మినీ గోకులం షెడ్లు ప్రారంభం**

**ఉంగుటూరు:** ఆత్కూరులో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్లను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో ఇ.సత్యకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు తెలుపుతూ మండలంలో మినీ గోకులాలు 50 మంజూరు కాగా 40పూర్తి చేశామని, 10 వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు.

## కనుమూరి చిన్నరాజు మృతి



**హనుమాన్‌జంక్షన్ రూరల్:** హనుమాన్‌జంక్షన్ పుర ప్రముఖుడు, అభయాంజనేయస్వామి దేవస్థానం దాత కనుమూరి సూర్యనారాయణరాజు (చిన్నరాజు) (85) మృతిచెందారు. గత కొద్దిరోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్టణంలో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఐదురుగు కుమారులు, ఒక కుమార్తె. లారీ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో చిన్నరాజుగా పేరొందిన ఆయన పలు ఆలయాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఇతోధికంగా విరాళాలు అందించారు. స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో నల్లరాతి హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో పాటుగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు విరాళాలు అందించారు.

## క్లుప్తంగా

### కూటమి నేతలకు నోటీసులు



**పెనమలూరు:** సంక్రాంతి పండుగ సందర్భంగా పోరంకి, యనమలకుదురు, పెదపులిపాకలో కోడి పందేలు వేయడానికి కూటమి నేతలు రంగంలోకి దిగారు. పోరంకిలో జనసేన నేత టి.గణేష్ కోడిపందేలు వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాడు. ఈ సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, సీఐ వెంకటరమణ, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి కంచె తొలగించారు. జనసేన నేత గణేష్‌కు నోటీసు ఇచ్చారు. అలాగే యనమలకుదురులో టీడీపీ నాయకుడు అజాద్ కోడిపందేలు వేయడానికి బరి సిద్ధం చేస్తుండటంతో ఆయనకు కూడా నోటీసు ఇచ్చారు. కాగా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న నేతలపై కేసులు ఎందుకు నమోదు చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### దేశ రక్షణలో సైనికులదే కీలకపాత్ర

**ఉయ్యూరు:** దేశ రక్షణలో సైనికులదే కీలక పాత్ర అని ఉయ్యూరు ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్ అన్నారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్మీడే నిర్వహించారు. సైనికుల ఆవశ్యకతను చాటుతూ ఎన్‌సీసీ క్యాడెట్లు జాతీయ జెండాలతో ప్రదర్శన చేపట్టారు. ప్రిన్సిపాల్ శివనాథ్ మాట్లాడుతూ దేశ ప్రజలందరూ ప్రశాంతంగా జీవిస్తున్నారంటే సైనికులే కారణమన్నారు. భారత సైన్యం త్యాగనిరతిని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ జీజీపీ వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, ఎన్‌సీసీ అధికారులు పాలడుగు శ్రీరాం తేజ, జీవీ రమణ పాల్గొన్నారు.

### చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్ల మెరుపు సమ్మె



**పెనమలూరు:** తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో తడిచెత్త-పొడిచెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు వేతనాలు ఇవ్వడం లేదని శుక్రవారం మెరుపు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా మండల సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ గత మూడు నెలలుగా వ్యాన్ డ్రైవర్లకు వేతనాలు చెల్లించలేదన్నారు. వేతనాల కోసం కమిషనర్‌కు విజ్ఞప్తి చేయగా వెంటనే చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ వేతనాలు ఇవ్వలేదన్నారు. ఇలా అయితే వ్యాన్ డ్రైవర్ల కుటుంబాలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన మాట తప్పినందునే సమ్మెబాట పట్టామని తెలిపారు. వేతనాలు ఇచ్చే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నేతలు మస్తాన్‌వలి, నరేంద్ర, నరసింహారావు, నేరెళ్ల, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

**ఉయ్యూరు:** పట్టణంలోని పేదలకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో రోడ్ల వెంబడి జీవనం గడుపుతున్న పేదలకు దుప్పట్లు అందజేశారు. సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరెళ్ల తేజ, ప్రతినిధులు పేరూరి నిఖిల్, కొల్లిపర హేమంత్ పాల్గొన్నారు.

### అర్హులకు నివేశన స్థలాలు పంపిణీ చేయాలి



**గన్నవరం:** అర్హులైన పేదలందరికి నివేశన స్థలాలు పంపిణీ చేయడంతో పాటు 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పింఛన్లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పేదలతో కలిసి సంఘ నాయకులు రెవెన్యూ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దారు కె. వెంకటశివయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. నేతలు కొండా వీరాస్వామి, తిరివీధి సుబ్బారావు, మన్నెం గోపాలకృష్ణ, విజయరావు, గౌరీశంకర్‌రావు, రంగారావు పాల్గొన్నారు.

### అత్తను చంపిన అల్లుడి కోసం పోలీసులు గాలింపు

**పెనమలూరు:** పోరంకిలో అత్తను చంపిన అల్లుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పోరంకి ప్రభునగర్‌లో గురువారం అత్త ఉమ్మడి రాణి(65)ని అల్లుడు ఎస్.నరేష్ కుటుంబ తగాదాల కారణంగా రాయితో తలపై మోది హత్య చేశాడు. అతని కోసం పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. నిందితుడు తెలంగాణా నిజామాబాద్‌కు చెందిన వ్యక్తి కావడంతో అక్కడ కూడా వెతుకుతున్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రామవరప్పాడు:** విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసాదంపాడులోని శాస్త్రి బజారు, ఆశ్రమం రోడ్డు, ఎనికేపాడులో రైల్వేకట్ట, విజయఆగ్రో కట్ట, జెండాజెట్టు సెంటర్, 24కే కల్యాణ మండపం వెనుక ప్రాంతం, కొడాలివారి వీధి, కేవీఆర్ కాలనీ, ఎస్సీ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

**పెనమలూరు:** మురళీనగర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జేఆర్‌డీ టాటా ఎస్టేట్, గౌరీశంకర్‌నగర్, మురళీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

**గన్నవరం:** స్థానిక 33/11కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి. హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం, మర్లపాలెం, చిన్నఆవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, బీబీ.గూడెం, గోపవరపుగూడెం స్లేట్ స్కూల్, చిక్కవరం ఇండస్ట్రీస్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

### తల్లి, ఇద్దరు కుమార్తెలు అదృశ్యం

**పెనమలూరు:** తల్లి, ఇద్దరు కుమార్తెలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. యనమలకుదురు ఇందిరానగర్-1కు చెందిన దొండపాటి సుధాకర్ భార్య తారాకుమారి, ముగ్గురు కుమార్తెలతో ఉంటున్నాడు. భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తుండగా భార్య విజయవాడలోని ఓ హోటల్‌లో పని చేస్తుంది. అయితే ఈ నెల 8వ తేదీన తారాకుమారి, 5, 7వ తరగతులు చదువుతున్న ఇద్దరు కుమార్తెలతో తాను పనిచేస్తున్న హోటల్ వద్దకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. అయితే వారు తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త సుధాకర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

### ఎడ్లపూటీ లాగుడు పోటీలు ప్రారంభం

**కంకిపాడు:** జాతీయ స్థాయి ఎడ్లపూటీ లాగుడు పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కంకిపాడులోని బైపాస్ వెంబడి జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ముప్పా రాజా ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకల్లో భాగంగా జాతీయ స్థాయి ఎడ్లపూటీ లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను పార్టీ జిల్లా నేతలు అమ్మిశెట్టి వాసు, బి.రామకృష్ణ ప్రారంభించారు. న్యూసబ్ జూనియర్, సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

### అంపాపురంలో జూద శిబిరం ఏర్పాటుకు సన్నాహాలు



**హనుమాన్‌జంక్షన్ రూరల్:** బాపులపాడు మండలం అంపాపురంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఓ రియల్ ఎస్టేట్ ప్రాంగణంలో తెలుగు తమ్ముళ్లు జూద శిబిరం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పందెం రాయుళ్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సకల సౌకర్యాలు సిద్ధం చేస్తున్నారు. రేయింబవళ్లు కోడి పందేలు, పేకాట నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 20 ఎకరాల సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న ఈ జూద శిబిరంలో రోజుకు రూ. 10 కోట్లకు పైగా చేతులు మారే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. రాత్రిళ్లు కూడా పట్టపగలు తలపించేలా ఫ్లడ్‌లైట్లు, జనరేటర్లు సిద్ధం చేశారు. కోడి పందేలు నిర్వహణకు ప్రధాన బరితో పాటుగా మరో నాలుగు బరులు సిద్ధం చేస్తున్నారు. కోడిపందెలు తిలకించేందుకు ప్రత్యేకంగా వీఐపీ గ్యాలరీ, జనరల్ గ్యాలరీ ఏర్పాటు చేస్తున్నారు. జూద ప్రాంగణంలో కాయ్ రాజా కాయ్, గుండాట వంటి జూదాలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. జూదగాళ్ల కోసం సిగరెట్లు, ఖైనీలు, బిర్యానీ దుకాణాలు సిద్ధం చేస్తున్నారు.